01ATP28F_01ATP28F.qxd 28-03-2025 PM 10:55 Page 1

# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శనివారం 29 మార్చి 2025 పేజీలు : 04


# పెద్దారెడ్డి ఇల్లు కూల్చేదే....!

- నాలుగు సెంట్ల మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకున్నారు
- అవును మావి కక్ష సాధింపు చర్యలే..
- తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

**అనంతపురం, మార్చి 28 ప్రభాతవార్త బ్యూరో**

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నాలుగు సెంట్ల మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టారని ఆయన ఇల్లు కూల్చేస్తామని ఇది కక్ష సాధింపు చర్యలే అనుకున్నా పర్వాలేదని టిడిపి నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. వైసిపి హయాంలో మేము తప్పులు చేయకపోయినా జైలుకు పంపారని చెబుతూ ఇప్పుడు టీడీపీ హయాంలో వైసిపి నేతల తప్పులను లీగల్‌గా చూపించి జైలుకు పంపుతున్నామని ఆయన వెల్లడించారు. అనంతపురంలో శుక్రవారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా అనంతపురం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మలు కలిసి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటికి సంబంధించి వివరాలను అందజేసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈసందర్భంగా జెసి ప్రభాకర్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలో ఇంటి నిర్మాణం కోసం ఆరు సెంట్లను కొనుగోలు చేసి మరో నాలుగుసెంట్ల మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకున్నాడన్నారు. ఈ విషయంపై నిబంధనల ప్రకారం ముందుకెళ్తామని అక్రమంగా కట్టించిన ఇంటిని కూల్చేస్థామని ఆయన వెల్లడించారు. ఏమన్నా అంటే ఇది కక్షసాధింపు చర్యలు అంటారు, కక్ష సాధింపు చర్యలే అనుకోండని రికార్డుల ప్రకారం ముందుకెళ్తామని ఆయన వెల్లడించారు. ఏడెనిమిది నెలలనుంచి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటికి సంబంధించి వివరాలు అందజేశామని, అయితే అధికారులు ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే మళ్లీ జాయింట్ కలెక్టర్‌ను కలిసి విన్నవించానని, 10 రోజులు సమయం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ చెప్పినట్లు జేసి ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు. తాడిపత్రిలో వైసిపి నాయకులు ఫయాజ్‌బాషా ఇంటికి సంబంధించి 20 ఏళ్లుగా కోర్టులో నలుగుతోందని, ప్రస్తుతం నిబంధనల ప్రకారం ముందుకెళ్తున్నట్లు ఆయన వెల్లడించారు. మాజీ మంత్రి రజిని ఏదంటే అది మాట్లాడుతోందని, మళ్లీ మా ప్రభుత్వం వస్తుందని చెబుతోందని, ఏమీ మాట్లాడకుండా ప్రశాంతంగాఉంటే బాగుంటుందని ఆయన సలహా ఇచ్చారు. పోసాని కృష్ణ మురళీ సినిమాలో నటనను చూసేవారని, ఇప్పుడు ఆయన మాట తీరు సరిగా లేదన్నారు. ఏ తప్పు చేయకపోయినా తాను జైలుకు పోలేదా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు వైసిపి నాయకులు చేసిన తప్పులను బయటకు తీసి ప్రభుత్వం జైలుకు పంపుతోందని ఆయన వివరించారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

# రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నికలు వాయిదా

## - కోరంలేక వాయిదా

ఎంపిటిసి సభ్యులను తనిఖీలు చేసి లోపలికి పంపుతున్న పోలీసులు

సమావేశానికి హాజరైన ఎంపిటిసి సభ్యుల నుంచి సంతకాలు చేయించుకుంటున్న దృశ్యం

మాట్లాడుతున్న ఎన్నికల అధికారి

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**రామగిరి, మార్చి 28 ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లాలో రామగిరి, గాండ్లపెంట ఎంపిపి ఎన్నికలు శుక్రవారం కూడా వాయిదా పడ్డాయి. వైసిపి ఎంపిటిసిలు అందరూ సమయానికి రాకపోవడం కోరం లేకపోవడంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు. మళ్లీ ఎలక్షన్ కమిషన్ అనుమతి ఇచ్చినప్పుడే ఎన్నికలు జరుగుతాయి. మండల ప్రజాపరిషత్ ఎంపిపి ఉపఎన్నికల మళ్లీ వాయిదాపడింది. 12 గంటల్లోగా హాజరు కావాల్సిన సభ్యులు నలుగురు మాత్రమే హాజరు కావడంతో కోరంలేక వాయిదా పడింది. ఉదయం వైసిపికి చెందిన ఎంపిటిసి సభ్యులు హాజరవుతారా కారా అంటూ పోలీసులు, ప్రజలు ఉత్కంఠతో ఎదురుచూశారు. 12 గంటలు కావస్తున్నా వారు హాజరు కాలేదు. తాము రామేశ్వరంలో ఉన్నామని ఎంపిపి ఉప ఎన్నికకు రాలేకపోతున్నామని ఎంపిటిసిల వీడియోలు హాల్‌ఛల్ చేశాయి. ఈ వీడియోలు రావడంతో టిడిపి నాయకులు, పోలీసులు వైసిపి ఎంపిటిసిలు ఇక రారంటూ తెలిసిపోయింది. అయితే ఎన్నికల అధికారి 12 గంటలు సమయం దాటేంత వరకు ఉండి ఆయన మాట్లాడుతూ.. ఎంపిటిసి సభ్యులు పూర్తిగా హాజరుకాకపోవడం కోరం లేదని ఎంపిపి ఉప ఎన్నికనువాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. తాము రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు, జడ్పి సిఈఓకు ఎంపిపి ఉపఎన్నికల వాయిదా జాబితాను పంపనున్నట్లు తెలిపారు. ఎన్నిక వాయిదా పడిందని తెలపడంతో టిడిపినాయకులు, కార్యకర్తలు బాణాసంచాలు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. సభ్యుల బలం ఉండి వారు రాలేకపోయారన్నారు. టిడిపి నాయకులు రామ్మూర్తి నాయుడు, సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిచూసి వైసిపిసభ్యులు టిడిపికి ఆకర్షితులయ్యారన్నారు. వారి వద్ద ఉన్న ఐదు మంది సభ్యులలో తమవైపు వస్తారన్న అనుమానంతో వారిని ఎన్నికకు హాజరు కాకుండా చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యేప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. పేరూరు డ్యాం గేట్లు విరగట్టి వాటి మరమ్మత్తులు కూడా చేయించలేదన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత పేరూరు డ్యాం అభివృద్ధికి నిధులు తీసుకువచ్చి మరమ్మత్తులు చేపట్టారని,గ్రామాలలో రోడ్డు, అభివృద్ధిని చూసి ఎంపిటిసి సభ్యులే టిడిపికి ఆకర్షితులయ్యారన్నారు. ప్రకాష్‌రెడ్డి చేత కాని వ్యక్తి అని అందుకే ఆయన సభ్యులను ఎన్నికకు దూరంగా తీసుకెళ్లారని ఆరోపించారు. కాగా ఎన్నిక సమయంలో ధర్మవరం డిఎస్పీ హేమంత్‌కుమార్, రామగిరి సిఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, పర్యవేక్షణలో పటిష్టబందోబస్తు నిర్వహించారు.

# కార్మికుల శ్రేయస్సు కోరేది వైసీపీ మాత్రమే

**- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి.- అనంతలో ఘనంగా వైసీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం**

**అనంతపురం సిటి, మార్చి 28 ప్రభాతవార్త**

అన్నివర్గాల కార్మికుల శ్రేయస్సు కోరేది వైసీపీ మాత్రమేనని, అందులో భాగంగానే వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించరాని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి,మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి లు నివాళి అర్పించారు. ఆ తర్వాత కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ అనే మన పార్టీలోని ఎస్స్ అనే అక్షరం శ్రామికులను సూచిస్తుందన్నారు. ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. వైసీపీఆవిర్భావం తర్వాత ట్రేడ్ యూనియన్ ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ట్రేడ్ యూనియన్ తొలి అధ్యక్షుడుగా పని చేసి ఆదినారాయణరెడ్డి భౌతికంగా ఇప్పుడు లేకపోవడం బాధాకరమంటూ ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత అధ్యక్షుడుగా కొర్రపాడు హుసేన్‌పీరా పనిచేశారని, కొత్తగా నియమితులైన ఓబిరెడ్డి కూడా మరింత ఉత్సాహంగా పని చేసి కార్మికులకు అండగా ఉండాలన్నారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉండగా కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసిందని, ఆ తర్వాత వైఎస్ జగన్ సీఎం అయ్యాక కార్మికలోకానికి అండగా నిలిచామన్నారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలోనే ఆశ వర్కర్లకు రూ.3 వేల నుంచి రూ.10 వేలు చేశామని, ఒకే సారి వేతనాన్ని 300 శాతం పెంచిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తెలిపారు. అదేవిధంగా డ్వాక్రా సంఘాల్లో పని చేసే యానిమేటర్లు, బుక్ కీపర్లకు రూ.10 వేలు గౌరవ వేతనం అందించింది కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేశామన్నారు. జగన్ సీఎం అయ్యాకే పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని రూ.18 వేలు చేసినట్లు చెప్పారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన పథకాలు కార్మిక నేస్తాలుగా నిలిచాయని తెలిపారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్మికుల సంక్షేమం కోసం ఆలోచిస్తుందని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏ వర్గానికీ మంచి చేయడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే ట్రేడ్ యూనియన్‌ను మరింతగా బలోపేతం చేయాలని సూచించారు.ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కార్మికులను అదుకొని భరోసా ఇస్తే కూటమి పాలనలో కార్మికులు ఉపాధి కోసం వలసలు పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు .కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత

# ఘనంగా రంజాన్ ఇఫ్తార్ విందు

**- ఇఫ్తార్ విందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**
**- శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ**

**అనంతపురం న్యూటౌన్, మార్చి 28 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలోని సాయినగర్ 8వ క్రాస్‌లో ఉన్న అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ ఇఫ్తార్ విందు 2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, శింగనమల ఎమ్మెల్యే బండారుశ్రావణి శ్రీ, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డిఆర్‌ఓ ఏ.మాలోల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ..పవిత్ర రంజాన్ మాసం సన్మార్గానికి మారుపేరని, జిల్లాలోని ముస్లిం సోదరసోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో, చిత్తశుద్ధితో ముస్లిం సోదరసోదరీమ ణులు ఉపవాసాలు చేస్తారని, తద్వారా శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక దృఢత్వం కూడా పొందుతారన్నారు. ఉపవాస దీక్ష చేస్తూ కుటుంబ సభ్యులు, అన్నదమ్ములు, అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తారన్నారు. దానధర్మాలకు ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమ కోసం కృషి చేస్తోందన్నారు. ముస్లిం సోదరులు ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ..ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. తమ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ముస్లిం సోదరుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. అంతకుముందు ముస్లిం సోదరులు ఇఫ్తార్ ఉపవాస దీక్ష విరమించి నమాజ్ ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులతోపాటు జిల్లా కలెక్టర్ నమాజులో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ స్వయంగా వడ్డించారు. తదనంతరం వారు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, తహసిల్దార్ హరికుమార్, క్రిస్టియన్ కార్పొరేషన్ అధికారి మధుసూదన్, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ రహీం అహ్మద్, జిజిహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారాం, డివిఎంసి మెంబర్ ఎంఎండి ఇమామ్, ముస్లిం మత పెద్దలు మోలానా హరుణ్ రషీద్, మోలానా హరుణ్ అష్రఫీ, మోలానా ముల్లా మహమ్మద్ జైద్, హఫీజ్ గులాం రసూల్, రిటైర్డ్ ఎస్పీ షేక్షావలి, ఇతర ముస్లిం మత పెద్దలు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

# ఉపాధి కూలీలకు వసతులు కరువు...!

**- అందని పనిముట్లు, టార్పాలిన్లు - చెట్లు కింద, ఎండలోనే కూర్చోని భోజనం తింటున్న కూలీలు**
**- సొంతంగా గడ్డిపార కొనుగోలు చేసి పనులు చేస్తున్న కూలీలు - గడ్డిపార సాన పెట్టెందుకు, త్రాగునీరుకు, గంపకు నగదు ఇవ్వనివైనం - తెలిసినా పట్టించుకోని డ్వామా రాష్ట్ర ఉన్నతాధికారులు**

కామారుపల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

కూలీలు సొంతంగా తెచ్చుకున్న గడ్డిపార, గంప, త్రాగునీరు

**అనంతపురం న్యూటౌన్, మార్చి 28 ప్రభాతవార్త**

అసలే ఎండకాలం. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి పనులు చేసే కూలీలకు సరైన వసతులు కల్పించడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారు. దీనికి తోడు పనిముట్లు, గడ్డిపారకు సానపెట్టేందుకు, త్రాగునీరు, గంప కోసం చెల్లించాల్సిన నగదు చెల్లించడం లేదు. దీంతో అరకొర సౌకర్యాల నడుమ కూలీలు పనులు చేయాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

అనంతపురం జిల్లాలో 31 మండలాల్లో 2,59,526 కుటుంబాలకు ఉపాధిహామీ పథకం కింద జాబ్ కార్డులున్నాయి. మొత్తం 4,57,686 మంది కూలీలున్నారు. ఒక పంచాయతీలో ఎన్ని కూలీల గ్రూపులు ఉంటే అన్ని గ్రూపులకు టార్పాలిన్లు అందజేయాలని చట్టంలో నిబంధన వుంది. ఆ టార్పాల్స్‌ను ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతి రోజు పనులు జరిగేచోట కట్టాల్సి వుంది. కూలీలు ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం టార్పాల్స్ కింద కూర్చొని తినేలా వసతి కల్పించాలి. కానీ గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టార్పాల్స్‌ను పంపిణీ చేయడం లేదు. దీంతో కూలీలు పనులు చేసే చోట చెట్లు ఉన్న చోట్ల చెట్లు కింద, చెట్లు లేని చోట్ల ఎండలో కూర్చొని భోజనం తింటున్నారు. ప్రస్తుతం ఎండకాలం ప్రారంభం కావడంతో ఉదయం నుండి దాదాపు 11 గంటల వరకు పనులు చేస్తున్నారు. మధ్యలో భోజనం ఎండలోనే కూర్చొని తింటున్నారు. అంతేకాకుండా కూలీల రోజు వారి వేతనంలో పది శాతం త్రాగునీరుకు, గడ్డిపారకు సాన పెట్టేందుకు రూ.10లు, గంపకు రూ.5 రుపాయిలు చొప్పున వేతనాలతో పాటు కూలీల ఖాతాల్లో నగదు జమ చేయాల్సి వుంది. కానీ 2020-21 నవంబర్‌లో కొత్తగా ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ రావడంతో అప్పటి నుండి త్రాగునీరు, గడ్డిపార, గంపకు చెల్లించాల్సిన నగదు చెల్లించడం లేదని సంబంధిత అధికారులే చెబుతుండటం గమనార్హం. దీంతో కూలీలు రెండు వారాలకు ఒక సారి గడ్డిపారకు సాన పెట్టించుకోవడానికి రూ.150లు, ఒక వేళ స్థానిక గ్రామంలో సాన పెట్టేవాళ్లు లేకపోవడంతో పక్క గ్రామాలకు వెళ్లి సాన పెట్టించుకురావడానికి రూ.50 లు మొత్తం రూ.200లు సొంతంగా ఖర్చు పెట్టుకుంటున్నామని, అంతే కాకుండా త్రాగునీరు కూడా ఇంటి నుంచే తెచ్చుకుంటున్నామని కూలీలు వాపోతున్నారు.

**2017-18 నుండి పనిముట్లు లేవ్ :**

ఒక గ్రామ పంచాయతీలో కూలీలకు సంబంధించి ఎన్ని గ్రూపులు ఉంటే...ఒకొక్క గ్రూప్‌కు రెండు లేదా మూడు పనిముట్లు (గడ్డిపార)ను ప్రభుత్వం పంపిణీ చేయాలని చట్టంలో నిబంధన వుంది. అయితే 2017-18 నుండి ఇప్పటి వరకు ఒక్క సారి కూడా పనిముట్లు ఇవ్వలేదని కూలీలు వాపోతున్నారు. దీంతో కుటుంబ పోషణ కోసం, సొంత గ్రామాన్ని వదిలి వెళ్లడానికి ఇష్టంలేక సొంతంగా రూ.1000 నుండిరూ1500లు పెట్టి గడ్డిపారను కొనుగోలు చేసి ఉపాధిహామీ పనులకు వెళ్లి వచ్చే వేతనాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ విషయం ఉపాధిహామీ పథకం పనులు తనిఖీలు చేయడానికి వచ్చే జిల్లా, డివిజన్, మండల అధికారులకు అనేక సార్లు చెప్పినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలీలుకు వసతులు కల్పించాలని, పనిముట్లు ఇవ్వాలని, రోజు వారి వేతనంలో పది శాతం త్రాగునీరుకు, నగదు గడ్డిపార సాన పెట్టేందుకు రూ.10లు, గంపకు రూ.5లు నగదు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. అయితే ఉన్నతాధికారులు దీనిపై ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.

**పనిముట్లు,టార్పాలిన్లు రాలేదు : డ్వామా పీడీ సలీంబాషా**

డ్వామా పీడీ సలీంబాషా

అనంతపురం జిల్లాలో 2,59,526 కుటుంబాలకు ఉపాధిహామీ పథకం కింద జాబ్ కార్డులున్నాయి. మొత్తం 4,57,686 మంది కూలీలున్నారు. కూలీలకు పంపిణీ చేయాల్సిన పనిముట్లు, టార్పాలిన్లు దాదాపు 2017-18 ఆర్థిక సంవత్సరం నుండి జిల్లాకు రాలేదు. 2020-21 నవంబర్‌లో కొత్తగా ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ వచ్చిన తర్వాత కూలీలకు రోజువారి వేతనంలో పది శాతం త్రాగునీరుకు, గడ్డిపార సాన పెట్టేందుకు రూ.10లు, గంపకు రూ.5 రుపాయిలు చెల్లించడం లేదు. వీటికి అందులో ఆప్షన్ లేదు. కూలీలకు అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటాం.

# జిల్లాలో పలు మార్కెటయార్డులకు చైర్మన్‌ల నియామకం

## - టిడిపిలో జోష్

**అనంతపురం, మార్చి 28 ప్రభాతవార్త బ్యూరో**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు మార్కెట్‌యార్డులకు చైర్మన్లను శుక్రవారం కూటమి ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో 47 మార్కెట్‌యార్డు కమిటీలకు చైర్మన్లను నియమించగా అందులో 37 మార్కెట్‌యార్డులకు టిడిపి వారిని, 8 మార్కెట్‌యార్డులకు జనసేన వారిని, 2 మార్కెట్‌యార్డులకు బిజెపి వారిని నియమించారు. అందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ధర్మవరం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా జగ్గా నాగరత్నమ్మ (బిజెపి), మడకశిర మార్కెట్‌యార్డు చైర్మన్‌గా బిఎస్‌గురుమూర్తి(టిడిపి), గుంతకల్లు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా సుగాలి లక్ష్మిదేవి(టిడిపి), హిందూపురం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా (అశ్వర్థనారాయణరెడ్డి (టిడిపి), కళ్యాణదుర్గం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా బోయ లక్ష్మిదేవి (టిడిపి)లను ప్రభుత్వం నియమించింది. ఇదే విధంగా రాయలసీమ జిల్లాలో నగరి, పీలేరు, మైదుకూరు, నంద్యాల, పాణ్యం, పత్తికొండ, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌లు కూడా ప్రభుత్వం నియమించింది.

# రాష్ట్రానికి రూ.259 కోట్లు అదనపు కేంద్ర నిధులు కోరిన మంత్రి సత్యకుమార్ యాదవ్...!

కేంద్ర మంత్రులతో భేటీ అయిన మంత్రి సత్య కుమార్ యాదవ్

**ధర్మవరం, మార్చి 28 (ప్రభాతవార్త)**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ జాతీయ ఆరోగ్య మిషన్, ఇతర పథకాల కింద రాష్ట్రానికి అదనంగా రూ.259 కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తో శుక్రవారంనాడు సమావేశమైన మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమెకు ఈ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద పునఃకేటాయింపులు జరిపే తరుణంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ ప్రతిపాదనను కేంద్రం ముందుంచారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ రూ.800 కోట్ల మేరకు పునఃకేటాయింపుల కింద అదనపు నిధుల్ని కోరింది. వీటిలో ఎన్‌హెచ్ ఎం కింద రాష్ట్రానికి రూ.109 కోట్లు విడుదల చేయాలని కేంద్ర వైద్య, ఆర్థిక శాఖా మంత్రుల్ని కోరారు. పర్ఫార్మెన్స్ ఇన్సెంటివ్ కింద రాష్ట్రానికి మరో రూ.150 కోట్లు విడుదల చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.కేంద్ర టూరిజం, న్యాయ, అణుశక్తి శాఖా మంత్రులతో కూడా సమావేశమైన మంత్రి సత్యకుమార్ యాదవ్ రాష్ట్రానికి చెందిన పలు విషయాలపై చర్చించారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి, క్యాన్సర్ చికిత్సల విషయంలో అదనపు కేంద్ర సాయాన్ని కోరారు.

02ATP27_02ATP27.qxd 28-03-2025 PM 10:24 Page 1



# ఉపాధి హామీ పథకం పనుల ప్రణాళిక పై సమీక్ష

డి.హీరేహాళ్, మార్చి 28 ప్రభాతవార్త:

సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్డీఓ జ్ఞానేశ్వర్‌రావు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిఎల్‌డిఓ జ్ఞానేశ్వర్‌రావు నొక్కిచెప్పారు. శుక్రవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన ఎంపిడిఓ దాస్‌నాయక్, ఉపాధి హామీ ఏపిఓ ఓబన్నలతో కలిసి ఉపాధి హామీ సిబ్బందితో ఉపాధి పథకం పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో 100రోజులు పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలు ఎంతమంది ఉన్నారన్న సమాచారంను ఆయన ఉపాధి సిబ్బందిని విచారించి తెలుసుకున్నారు. వచ్చే ఈ ఆర్థిక సంవత్సరంలో మండల పరిధిలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి వ్యక్తిని ఉపాధి హామీ పథకం పనుల్లో భాగస్వామ్యులను చేయాలని బాధ్యత ఉపాధి హామీ సిబ్బందిగా మీ పై ఉందని ఆయన తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపాధి హామీ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఈసి రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు సుధాకర్, గురుమూర్తి, శ్రీనివాసులు, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

# నివాళులర్పించి సంతాపం తెలిపిన వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి

డి.హీరేహాళ్, మార్చి 28 ప్రభాతవార్త:

బోయ అంపన్న భౌతికకాయంకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప ఆ సేవా సమితి ఉపాధ్యక్షుడు మలకన్న, న్యాయనలవాదారులు న్యాయవాది రవిచంద్ర, సభ్యులు, మిత్రులతో కలిసి మృతుడు బోయ అంపన్న(60), బండి బేబక్క(63)ల భౌతిక కాయాలకు పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని కోటలో ఉన్న మారెమ్మ గుడి ఏరియాకు చెందిన మృతుడు అంపన్న అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుడి కుమారుడు తిప్పేస్వామి అందించిన సమాచారం మేరకు రాయదుర్గం పట్టణంలోని మృతుడి స్వగృహంకు చేరుకొని నివాలులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని లక్ష్మిబజార్‌కు చెందిన బండి జయరాములు భార్య బండి బేబక్క ఆకస్మిక మరణం సమాచారం అందుకున్న ఆయన వాల్మీకి సంక్షేమ సేవా సమితి పరివారముతో వెళ్లి తమ సంతాపం వెలిబుచ్చారు. ఆ ఇరువురి మరణం తమకెంతో బాధ కలిగిస్తోందని వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను కలుసుకొని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఆ సేవా సమితి సభ్యులు అజయ్‌టైలర్ రఘు, గుండా మేస్త్రి మూరెన్న, సిద్దలింగప్ప, పైతోట ముత్తప్ప, మాజీ కౌన్సిలర్ పైతోట ముద్దుల రామాంజినేయులు, మేస్త్రి తిప్పేస్వామి, లాలప్ప, మిత్రులు గొల్ల గోపాల్, గాజుల భీమరాజులు తదితరులు పాల్గొన్నారు.

బండి బేబక్క భౌతిక కాయంకు పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం.

# వివిధ కేసుల్లో పట్టుబడ్డ మద్యం ధ్వంసం

కంబదూరు, మార్చి 28 ,ప్రభాతవార్త,

మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కంబదూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 79 కేసుల్లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం నాటుసారాను ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, డిటిఎఫ్ ఇన్స్పెక్టర్ జయనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ శుక్రవారం మీడియాకు తెలిపారు. సుమారు మద్యం విలువ రూ. 1,93,000 ఉంటుందని ఎక్సైజ్ పోలీసులు వెల్లడించారు. అయితే ప్రభుత్వం నవోదయ 2.0 కార్యక్రమం లో భాగంగా నాటు సారా, కర్ణాటక మద్యం నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలియజేశారు. కావున నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్‌విజిఎం కళాశాల వార్షికోత్సవం

కళ్యాణదుర్గం టౌన్, మార్చి 28 ప్రభాతవార్త

కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్ విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ కార్యక్రమం చాలా అట్టహాసంగా జరిగాయి. కళాశాలలో శుక్రవారం ఉదయం 10గంటలకు అధ్యాపకులు మరియు విద్యార్థిని, విద్యార్థులు సరస్వతి విగ్రహంకు పూజచేసి అమ్మవారి ఆశీస్సులు తీసుకొన్నారు. అదనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.జయరామరెడ్డి అధ్యక్షతన వార్షికోత్సవ సభ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తమలక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్యంవైపు అడుగులు వేయాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఉన్నతస్థాయికి ఎదిగి మీ తల్లిండ్రులు కన్న కళలను నెరవేర్చాలని, చదివిన కళాశాలకు కూడా పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. అయితే మన కళాశాల ప్రిన్సిపాల్ ఈ నెల 31వ తేదీన పదవి విరమణ పొందుతున్నారు కాబట్టి ఇది చవరి వార్షికోత్సవం కాబట్టి అధ్యాపకులు మరియు విద్యార్థులు ప్రిన్సిపాల్‌ని కళాశాల కోసం మరియు విద్యార్థుల కోసం చేసిన కృషిని గూర్చి కొనియాడారు. తదనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో చాలా ఉత్సాహంగా, కేరింతలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంవి. శేషయ్య, అధ్యాపకులు టి. శైలజ రాణి, సూర్య నాగిరెడ్డి, శ్రీధర్, జోష్ణ, కవిత, చాముండేశ్వరి, శ్యాంప్రసాద్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకరించండి

ఎమ్మెల్యే కార్యదర్శి శ్రీనివాసరావు

సమీక్ష నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

హిందూపురం మార్చి 28 ప్రభాతవార్త

హిందూపురం పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ రాజకీయ కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కొడికొండ చెక్ పోస్ట్, తూముకుంట, గోళ్లాపురం ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూ కేటాయింపుల ప్రక్రియను అవసరమైన చోట వెంటనే చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ దేవకాంత, ఎమ్మెల్యే పి ఏ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ కౌన్సిలర్ ఔదార్యం..

నిత్యావసర వస్తువులు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్ మార్చి 28 ప్రభాతవార్త

హిందూపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ దీపిక వేణు రెడ్డి సూచన మేరకు ఉగాది సందర్భంగా 24వ వార్డు నందు పని చేయు పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను ఆ వార్డు వైసిపి కౌన్సిలర్ వెంకట నాగేంద్రబాబు అందజేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగేంద్రప్రసాద్, నాగరాజు, రవి, గంగా తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రూఆఫ్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి.. సిపిఎం డిమాండ్

కళ్యాణదుర్గం టౌన్, మార్చి 28 ప్రభాతవార్త:

తహసీల్దార్‌కు విపతిత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

కళ్యాణదుర్గం పట్టణంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇంధన సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆధ్వర్యంలో తహసీల్దార్ బాస్కర్‌కి సిపిం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటి సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రెండుసార్లు విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485కోట్ల భారం ప్రజలపై వేసిందని, ఈ భారానికి గత ప్రభుత్వం కారణమని సాకులు చెబుతుందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్దుబాటు చార్జీలను తీవ్రంగా విమర్శించిన తెలుగుదేశం, జనసేన నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని కొనసాగిస్తుందని, ప్రతి యూనిట్కు నెలకు రూ.1.46 నుండి రూ.1.65అదనంగా చెల్లించాల్సి వస్తుందని, 2024-25సంవత్సరానికి సంబంధించి మరోసారి సర్దుబాటు చార్జీల భారం వేయడానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో వేల కోట్ల భారం వేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ వినాశకర విద్యుత్ విధానాన్ని అమలు చేసిందని, అందులో భాగంగా స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. అధాని కంపెనీ ప్రయోజనాల కోసం సెకి సంస్థతో చేరుకున్న ఒప్పందాలు రాష్ట్ర ప్రజలపై నిరంతరం విద్యుత్ భారాలు వేసే విధంగా ఉన్నాయన్నారు. వీటిని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించడమే కాకుండా స్మార్ట్ మీటర్లను పగులగొట్టమని తెలుగుదేశం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాలు మరింత వేగంగా అమలు చేస్తున్నారన్నారు. వీటిని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని, నడుస్తున్న ప్రీకాట్ బిమిల్లు పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల మూతబడిందని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకులు భవిత్, బాలాజీ గాంధీ, డివైఎఫ్ఐ నాయకులు సోము, నాయకులు ఒంటిమద్ది గోవిందు, రామచంద్ర, ఈశ్వర్ పాల్గొన్నారు.

# త్రైత సిద్ధాంతం వారితో తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

తహసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ అధికారులు

కొత్తచెరువు మార్చి 28 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లా, కొత్త చెరువు మండల కేంద్రం లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక కొత్త చెరువు1 కమిటీ వారి ఆధ్వర్యంన శుక్రవారం త్రైత సిద్ధాంత తెలుగు ఉగా ది క్యాలెండర్ లను మండల తహశీల్దార్ నీలకంఠ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి నటరాజు మండల వ్యవసాయ అధికారి నటరాజు, మరియు కొత్తచెరువు మేజర్ పంచాయతీ సెక్రటరీ రాంభూపాల్ రెడ్డి కార్యాలయ సిబ్బంది చే విడి విడిగా ఆవిష్కరించారు, అనంతరం త్రైత శకం తెలుగు క్యాలెండర్ లను వారి సిబ్బందికి పలువురికి వితరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా తహసిల్దార్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచిక లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థం అయ్యే విధానం గా రూపొందించడం జరిగింది ..ఈ కాలసూచికలో ఇంకా చాలా విశేషాల్లో భాగంగా దేవాలయం సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, మరియు తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారముతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత యొక్క సారాంశం ఇందులో పొందుపరిచి స్వామివారు రచించడం జరిగింది అన్నారు.. తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథుల తో ఆంగ్ల తేదీల ను పొందుపరచి తయారు చేసిన ఇటువంటి గొప్ప కాలసూచికను అందించడం ప్రజలందరూ హర్షించదగ్గ విశేషం అన్నారు.కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎ.నాగేంద్ర గారుసి సాయి నాథ్, రెడ్డెప్ప చౌదరి లు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎంపీపీ ఉప సర్పంచ్ ఎన్నికలు

ప్రత్యేకంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ వి.రత్న

పుట్టపర్తి, మార్చి 28, ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఎంపీపీ ఉపసర్పంచ్ స్థానాల ఎన్నికలు పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. గతనాలుగురోజులుగా జిల్లా ఎస్పీ వి.రత్న స్వయంగా ప్రవేశిస్తూ పకడ్బందీ ప్రణాళికతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేపట్టారు. రామగిరి, రొద్దం, గాండ్లపెంట, ఎంపీపీస్థానాలు, పెనుగొండ,మడకశిర నియోజకవర్గం లోని రాంపురం కల్లుమర్రి ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అయితే రామగిరి గాండ్లపెంట ఎంపీపీస్థానాలు ఎన్నికవాయిదా పడింది. ఎన్నికల ప్రారంభమైనప్పటినుంచి ముగిసే దాకా జిల్లా ఎస్పీ ఆదేశాలతో ధర్మవరం కదిరి డిఎస్పీలు హేమంత్ కుమార్, శివన్నారాయణ ఆధ్వర్యంలో అడుగడుగునా భద్రతను పెంపొందించేలా పోలీసు సిబ్బందికి సూచనలిస్తూ ఎలాంటి సంఘటన జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎంపీపీ ఎంపిక ఒకరోజుముందే రామగిరిప్రాంతాలను పోలీస్ అధికారులు బందోబస్తు ఏర్పాట్లపై సూచనలుచేశారు. డి.ఎస్.పిలు,సిఐలు,ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలతో, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు.పోలీసు సిబ్బంది విధుల గురించి ముందే అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేయడంతో శుక్రవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన డ్రోన్, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టి పరిసరాలను పోలీసులు జల్లెడ పట్టి కట్టుది ఏర్పాట్లు చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతంగా ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకోవడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

# ప్రశాంతి నిలయంలో వైభవంగా యువత పర్యియాత్ర

ప్రుట్టపర్తి రూరల్ మార్చి 28 ప్రభాతవార్త :

మాస పత్రికను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు.

ర్యాలీగా ప్రశాంతి నిలయం చేరుకున్న వేలాదిమంది యువత

ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువత నిర్వహించిన పద్యయాత్ర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్ర రాష్ట్రం లోని ప్రతి జిల్లా నుండి వందలాది మంది సాయి యువత సభ్యులు 2000 లకు పైగా పర్యియాత్రగా పుట్టపర్తి ప్రెస్ చేశారు. ఈ సందర్భంగా వారు ఊరేగింపుగా ప్రశాంతను లేయానికి చేరుకున్నారు. అనంతరం సాయి కుమారి రాష్ట్ర మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థల్లో యువత పాత్ర గురించి, వారు చేస్తున్న సేవలు గురించి పేర్కొన్నారు. అనంతరం సత్యసాయి అష్టోత్తర శతనామావళి పటిస్తూ పాదుకా పూజ నిర్వహించారు. తిరిగి సాయంత్రం వేద పట్టణంతో వేడుకలు ప్రారంభించారు. కళాకారుడు వేణుగోపాల్ తను ఇసుకతో చేసిన సత్యసాయి చిత్రం, దేశ భౌగోళిక గీసిన చిత్రాలను చూపరులను ఆకట్టుకున్నారు. తదుపరి ఖిధర్మో రక్షతిఖి అనే నృత్య నాటికను యువత సభ్యులు ప్రదర్శించారు. ఈనాటికలో నరసింహావతారం ఆవిర్భావం గురించి తెలియజేశారు. తదుపరి సాయివిద్యార్థులు భజనలు ఆలపించారు. అనంతరం ట్రస్ట్ వర్గాలు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది యువతతో పాటు సాయి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నృత్య రూపంలో ఒక ఘట్టం

# ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదే

-ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఉరవకొండ, మార్చి 28 ప్రభాతవార్త

మాదిగల 30 సంవత్సరాల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిదేనని ఎంఆర్‌పీఎస్ తాలుకా అధ్యక్షులు రాంపురం చెన్నప్ప, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కౌకుంట్ల రవి అన్నారు. పట్టణంలోని స్థానిక క్లాక్‌టవర్ కూడలిలోగల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంపురం చెన్నప్ప, కైకుంట్ల రవి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయడానికి మంత్రి మండలిలోనూ, అసెంబ్లీలోనూ ఏకగ్రీవంగా తీర్మాణం చేసి ఎన్నికల ముందు మాదిగలకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. ఇందుకు సహకరించిన అన్ని శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో 22 మంది యువకులతో ప్రారంభమైన ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎందరో అమరులయ్యారని వారి ప్రాణ త్యాగం నేటికి ఫలప్రదం అయిందన్నారు. వర్గీకరణతో ఎస్సీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో సమాన అవకాశాలు దక్కుతాయని అట్టడుగు కులాలు కూడా అభివద్ధి చెందుతాయన్నారు. 2002-04 మధ్య వర్గీకరణను చంద్రబాబునాయుడు అమలు చేయగా 50వేల మంది మాదిగలకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం.వర ప్రసాద్, వార్డు సభ్యులు ఎం.రామాంజినేయులు, మీనుగ రవి, నాయకులు నాగన్న, లత్తవరం చంద్రశేఖర్, కౌకుంట్ల సురేష్, శంకరయ్య, మధు, రమేష్, శివ, ఓబన్న, దేవరాజ్, ఓబులేష్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 1 న సాంఘిక శాస్త్రం పరీక్ష.

కొత్తచెరువు మార్చి 28 ప్రభాతవార్త. : రాష్ట్ర ప్రభుత్వ పరీక్ష సంచాలకుల ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీన జరగవలసిన పదవ తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష ను ఏప్రిల్ ఒకటో తేదీ కి మార్పు చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి జి కృష్ణప్ప ఓ ప్రకటనలో తెలిపారు పరీక్ష సమయం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహించబడును కావున పరీక్ష తేదీ మార్పును పరీక్ష సిబ్బంది గమనించవలెను అన్ని ప్రభుత్వ యాజమాన్యా, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు ఈ విషయం తెలియజేయాలని డీఈఓ కోరారు.

# తెదేపా ఆవిర్భావ దినోత్సవం వేడుకలకు తరలిరండి...

డి.హీరేహాళ్, మార్చి 28 ప్రభాతవార్త:

డి.హీరేహాళ్ తెదేపా కన్వీనర్ హనుమంతరెడ్డి

రాయదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ఉదయం నిర్వహించనున్న తెదేపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు డి.హీరేహాళ్ మండలం నుండి అధిక సంఖ్యలో తరలిరావాలని మండల తెదేపా కన్వీనర్ హనుమంతరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తెదేపా డి.హీరేహాళ్ మండల కన్వీనర్ ప్రకటన ద్వారా తెలుపుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు మండల పరిధిలోని ఆయా గ్రామాల నుండి స్వచ్ఛందంగా తరలిరావాలని ఆయన తెలిపారు. శనివారం ఉదయం పది గంటలకు రాయదుర్గం పట్టణంలోని బళ్ళారి రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం సీతా రామాంజినేయ కళ్యాణమండపంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బిఎల్ఏలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

# చట్టాలపై అవగాహన కల్పించిన అధికారులు.

డి.హీరేహాళ్, మార్చి 28 ప్రభాతవార్త:

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దీంతో సమస్యలను అధిగమించేందుకు సులువుగా ఉంటుందని తహసీల్దార్ మునివేలు ప్రజలకు తెలియజేశారు. శుక్రవారం డి.హీరేహాళ్ మండల పరిధిలోని దొడగట్ట గ్రామంలో ఆయన ఈఓఆర్డీ యోగానంద, ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటి నియోజకవర్గ సభ్యుడు తదితరులతో కలిసి గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ పౌరహక్కుల దినం సందర్భంగా గ్రామ పెద్దలతోకలిసి పౌరహక్కులదినం జరుపుకోవడం జరిగిందని, ఈ కార్యక్రమంలో చట్టాలగురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు స్థానికంగా సమస్యల గురించి గ్రామ ప్రజల నుండి తెలుసుకుని తగిన సూచనలు చేయడం జరిగిందన్నారు. రోడ్డుప్రమాదాలు జరగకుండా మోటార్ సైకిల్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఛైల్డ్ మ్యారేజ్ చేయడం వల్ల జరిగే అనర్థాలు గురించి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవి కాలంలో చిన్న పిల్లలు ఈతకు వెళ్లేటప్పుడు పెద్దలు తగిన జాగ్రత్తలు పాటించాలని, వేసవికాలంలో వడ దెబ్బలు తగలకుండా తగిన సూచనలు పాటించాలని, రోగాలు ప్రభలకుండా గ్రామంను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు ఈఓఆర్డీ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్ హనుమంతరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మెన్ రామాంజినేయులు, విఆర్ఓ ఎద్దుల రఘునాథ్ పాల్గొన్నారు.

# ఎక్సైజ్ ఆధ్వర్యంలో వాహనాల వేలం

కంబదూరు ,మార్చి 28 ప్రభాతవార్త

ఎక్సైజ్ అధికారులు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

కంబదూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అధికారులు వివిధ నేరాల్లో పట్టుకున్న 15 వాహనాలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి, డిటిఎఫ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జయనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ మీడియాకు తెలిపారు. వేలంలో వాహనాలను విక్రయించగా రూ. 1,27,204 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన జీవ శాస్త్రం పరీక్ష.

265 మంది విద్యార్థులు జీవశాస్త్రం పరీక్ష

# అంతర్జాతీయ స్థాయిలో వైఎస్ఆర్‌సిపి బలోపేతానికి కృషి చేస్తా

## - జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ఎన్ఆర్ఐ హృదయాల్లో నిలిపేందుకు కృషి చేస్తా

## - ఎన్ఆర్ఐ వవిభాగ కో-ఆర్డినటేర్ ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల, మార్చి 28 ప్రభాతవార్త

వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎన్ఆర్ఐ హృదయాల్లో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు – ఎన్ఆర్ఐ వవిభాగ కో-ఆర్డినటేర్ ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌హోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎన్ఆర్ఐ విభాగ కోఆర్డినేటర్‌గా తనను నియమించడం పట్ల కృతజ్ఞతలుతెలియజేస్తూ ఆయన నిర్వర్తించే ప్రదాన లక్ష్యాలపట్ల పత్రిక ప్రకటన విడుదల చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను ఎంతో గౌరవంగా, పెద్ద బాధ్యతగా భావిస్తున్నానని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎన్ఆర్ఐ, వైఎస్ఆర్‌సిపి అభిమానులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే అవకాశం తనకి దక్కిందన్నారు. గతంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అంతర్జాతీయంగా గొప్ప మద్దతు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఇప్పుడు ఆ మద్దతును మరింత సమర్ధవంతంగా సమన్వయం చేయడం ఎన్ఆర్ఐలతో పార్టీకి సుస్థిరమైన సంబంధాన్ని ఏర్పరచడం ప్రధాన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్‌ప్రచారం కార్యక్రమాల ద్వారా పార్టీ అభిప్రాయాన్ని గ్లోబల్ డైస్కోరా వరకు తీసుకెళ్లడం ప్రతి దేశంలో నమ్మకమైన ఎన్ఆర్ఐ చాప్టర్లు ఏర్పాటు చేసి కార్యకర్తలకు తృప్తమైన మార్గ నిర్దేశనం కల్పించడం, పార్టీ పాలనలో అమలు చేసిన జనహితమైన సంక్షేమ పథకాలపై ఎన్ఆర్ఐల నుంచి అభిప్రాయాలను సూచనల ను సేకరించడం, జాతీయ అంత ర్జాతీయ వేదికలపై వైఎస్ఆర్‌సిపి నాయకత్వాన్ని ప్రతిబింబించేలా ఎన్ఆర్ఐలను భాగస్వాములుగా మారుస్తూ వ్యవస్తీకృతంగా ముందుకు తీసుకెళ్లడం వంటి ప్రధాన లక్ష్యాలుగా తన బాధ్యత సాగుతు ందన్నారు. బాధ్యతలు న్యాయంగా, నిబద్ధతతో నిర్వహిస్తూ వైఎస్.జగన్‌మో హన్‌రెడ్డి ఆశయాలను ప్రపంచ వ్యాప్తంగా ఎన్ఆర్ఐల హృదయాలలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి అభిమాని ఈ ప్రయా ణంలో నాకు తోడుగా ఉండాలని ఆశిస్తున్నానని ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు.

ఆలూరు సాంబశివారెడ్డి

# పి.ఎ.బి.ఆర్ లో II టీఎంసీల నీటిని నింపాలి

## ఇందుకు అవసరమైన భూసేకరణ కు ప్రభుత్వం నిధులు కేటాయించాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్

అనంతపురం, మార్చి 28 (ప్రభాతవార్త బ్యూరో)

పీఏబీఆర్ (పెన్నాహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) ను 11 టీఎంసీల సామర్థంతో నిర్మించారని అందులో భాగంగా 11 టీఎంసీల నీటి తో రిజర్వాయర్ని నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. పీఏబీఆర్ రిజర్వాయర్లో ప్రస్తుతం ఐదు టీఎంసీలకు మించి నిల్వ ఉంచడం లేదు అన్నారు. రిజర్వాయర్ను పూర్తి నీది సామర్థంతో నింపేందుకు 9, 248.30 ఎకరాలను భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 5,979 ఎకరాలే సేకరించారు అని ఆయన గుర్తు చేశారు. పూర్తిస్థాయి నీటి నిల్వలు ఉంచాలంటే పరిపాలన అనుమతులు బడ్జెట్ కేటాయింపులకు ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.. ఈ విషయంలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ చూపాలని ఆయన తెలియజేశారు. అదేవిధంగా అరటి, చీని, టమోటా రైతులకు శిక్షణ కేంద్రం, జిల్లాలో ఉద్యాన ఉత్పత్తులను పెంచే లక్ష్యంలో భాగంగా విత్తనం ఎంపిక నుంచి విక్రయం వరకు రైతులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆ యన ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కలెక్టర్ కోరా రు అని అందులకు ఆయనకు అభినంద నలు అన్నారు. అనంతపురము జిల్లా కరువు జిల్లా క్షామ పీడిత ప్రాంతం అతి తక్కువ వర్షపాతం ఉన్న జిల్లా కావున కరువును పారద్రోలాలంటే తుంగభద్ర డ్యామ్ నుండి 32.5 టిఎంసి నీరు రావాలి, హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి పిల్ల కాలువలు తవ్వి ఉభయ జిల్లాలకు ఆయక ట్టుకు నీరు ఇవ్వాలని కమ్యూనిస్టు పార్టీ డిమా ండ్ చేస్తున్నది. రానున్న రెండు మూడు రోజు లలో 30,31 తేదీలలోతెలుగు సంవత్స రాది ఉగాది పండుగ, నెలరోజుల పాటు ఉపవాసలు ఉండి పవిత్ర రంజాన్ పండుగను చేసుకోవడానికి సిద్ధమవుతున్న హిందువులకు, ముస్లింలకు, మీడియా మిత్రులకు, భారత కమ్యూనిస్టు పార్టీ, సిపిఐ జిల్లా సమితి హృదయ పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు జాఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మాట్లాడుతున్న జాఫర్

# కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

## - రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నల్లపల్లి విజయ్ భాస్కర్

అనంతపురం న్యూటౌన్, మార్చి 28 ప్రభాతవార్త

గత ప్రభుత్వంలో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడతల వారీగా చెల్లిస్తున్న కూటమి ప్రభుత్వానికి నల్లపల్లి విజయ్ భాస్కర్ పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న 20 వేల కోట్ల బకాయిలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన 10 నెలల్లో పి ఎఫ్, ఎపి జిఎల్ఐ, సిపిఎస్ మ్యాచింగ్ అమౌంట్ అన్ని కలిసి రూ.7వేలు200కోట్లను మంజూరు చేయడం హర్షనీయం అన్నారు. పెండింగ్ బకాయిల విడుదల కావడంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు చాలా సంతోష పడుతున్నారని, ఇతర బకాయిలు కూడా సౌలభ్యాన్ని బట్టి మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు ప్రకటించడం హర్షనీయం అని అన్నారు. గత 11వ పిఆర్ నలో ఉద్యోగులకు చాలా నష్టం జరిగిందని, 12వ పిఆర్‌సిలో ఉద్యోగులు అందరికీ న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. 12వ పిఆర్‌సి కమి షన్‌ను నియమించి ఉద్యోగ సంఘాల అభిప్రాయాలే కాకుండా క్షేత్రస్థాయిలో ఉద్యోగుల అభిప్రాయాలు తీసు కుంటే ఉద్యోగులం దరికీ మరింత న్యాయం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు కరువుభత్యాల ను, సరెండర్ లీవులు, ఇంటీరియమ్ రిలీఫ్‌ను వీలైనంత త్వరగా మంజూరు చేస్తే విధులలో ఉన్న ఉద్యోగులకు మరింత మేలు జరుగుతుంది అని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

నల్లపల్లి విజయ్ భాస్కర్

# మేయర్ వసీంని ఇస్లాం మతం నుంచి బహిష్కరించాలి

## - ఇఫ్తార్ విందుకు వెళ్లవద్దని చెప్పడానికి నువ్వు ఎవరు - గత ఐదేళ్లలో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అవుతుంటే ఏం చేశారు - ఎన్.ఆర్.సి, సిఏఏ, హిజాబ్ రద్దు వంటి వాటికి మీరెందుకు మద్దతు ఇచ్చారు - మేయర్ వసీంకి జిల్లా టిడిపి మైనార్టీ నాయకుల కౌంటర్ - మైనార్టీలంతా తెలుగుదేశం పార్టీ పక్షాన ఉంటారన్న నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 28 ప్రభాతవార్త

ఇఫ్తార్ విందుకు వెళ్లవద్దంటూ ఇస్లాం మతానికి వ్యతిరేకంగా మాట్లాడిన మేయర్ వసీంని.. మతం నుంచి వెలివేయాలని అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు అన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సైఫుద్దీన్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, మైనారిటీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి జెఎం బాషా, మైనార్టీ నాయకుడు ఖలందర్ మీడియా సమావేశం నిర్వహించారు. ముందుగా అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్ మాట్లాడుతూ.. మనదేశంలో సర్వ మతాలు ఒక్కేటనని, హిందువులు కూడా ఇఫ్తార్ విందులకు వస్తూ స్నేహభావంతో ఉంటారని అన్నారు. కానీ మతసామరస్యాన్ని దెబ్బ తీసే విధంగా ఇఫ్తార్ విందుకు వెళ్లవద్దంటూ వసీం వ్యాఖ్యలు చేశారన్నారు. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు గురించి మాట్లాడుతున్న మేయర్ వసీం గతంలో ఎన్ఆర్సి, సిఏఏ విదేశీ విద్యా వంటి వాటిపై గురించి ఎందుకు మాట్లాడలేదన్నారు. మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు మీరు ఎక్కడున్నారని ప్రశ్నించారు. కనీసం మసీదులకు కూడా నిధులు ఇవ్వలేదన్నారు. మైనార్టీలకు పదవులు ఇస్తున్నామని చెప్పి.. పథకాలు రద్దు చేశారన్నారు. మీరు మైనార్టీలు ద్రోహం చేశారు, కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి సైఫుద్దీన్ మాట్లాడుతూ.. ఇస్లాం మతం నుంచి మేయర్ వసీంను బహిష్కరించాలన్నారు. ముందు ఆయన అల్లాకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇఫ్తార్ విందుకు మీరు వెళ్ళవద్దని చెప్పినా.. పెద్ద ఎత్తున మైనార్టీలు పాల్గొని తెలుగుదేశం పార్టీకి మద్దతు పలికారన్నారు. సోషల్ మీడియాలో మీరు చేసిన ప్రచారాలను చూసి మైనార్టీలు చీత్కరించు కుంటున్నారన్నారు. గత 40 సంవత్సరాలుగా మైనార్టీల పక్షాన తెలుగుదేశం పార్టీ ఉంటూన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు తాము వ్యతిరే కమని చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారని దీనిపై కమిటీ కూడా వేసినట్లు వివరించారు. ఐదేళ్ల పాటు మై నార్టీలకు ద్రో హం వైసీపీని ప్రజలంతా బా య్ కాట్ చేయాలన్నారు. మరో వైపు మైనార్టీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి జేఎం బాషా, నగర ప్రధాన కార్యదర్శి ముక్తి యార్, మైనార్టీ నాయకుడు ఖా లం దర్‌లు మాట్లాడుతూ.. మేయర్ వసీం ఏ మాత్రం అవగా హన లేకుం డా మాట్లాడుతున్నారని.. ఆయన వ్యాఖ్యలు మతసామరస్యాన్ని, ఐక్యతను దె బ్బ తీసేలా ఉన్నాయన్నారు. గతంలో ఈ హిజాబ్‌ను వ్యతిరేకిం చినప్పుడు మీరు ఏమ య్యారని ప్రశ్నించారు. వైసిపి హయాంలో ఎవరికి మేలు జరిగి ందో ఒకసారి సమాధానం చెప్పాలన్నారు. మైనార్టీల గురించి అసెం బ్లీలో మాట్లాడిన అప్పటి డిప్యూటీ సీఎం నారాయణ గురించి మీరు ఎందుకు మా ట్లాడలేదని నిలదీశారు. వైసిపి హయాంలో వక్ఫ్ ఆస్తులు పెద్ద ఎత్తున అన్యా క్రాంత మయ్యాయన్నారు. తెలుగుదేశం పార్టీ మరీ ముఖ్యంగా ముఖ్య మంత్రి చంద్రబాబు ఆస్తులను పరిరక్షణ కోసం పని చేస్తున్నారన్నారు.

మాట్లాడుతున్న మైనార్టీ తెలుగుదేశం పార్టీ నాయకులు

# పెన్షన్ల పంపిణీకి సన్నద్ధం కండి

## - ఎంపిడిఓ భాస్కర్

మాట్లాడుతున్న ఎంపిడిఓ భాస్కర్

హాజరైన సచివాలయ ఉద్యోగులు

శింగనమల, మార్చి 28 ప్రభాతవార్త

ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఏప్రిల్ 1వ తేదిన పెన్షన్ల పంపిణీకి సన్నద్ధం కావాలని ఎంపిడిఓ భాస్కర్ సంబంధిత ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శిలు, విఆర్ఓలు, ఏఎన్ఎంలు, ఉపాధిహామీ సిబ్బంది మహిళా పోలీసులు, సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వ్యవసాయ సిబ్బంది, పశు సంవర్ధకశాఖ తదితర సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భాస్కర్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తం గా పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఏప్రిల్ 1వ తేది ఉదయం 7 గంటలకు పంపిణీ ప్రారంభించాలన్నారు. ముందుగా వెళ్లరాదని లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎలాంటి అవినీతికి తావివ్వరాదన్నారు. లబ్దిదారులకు మంచి మాటలతో పలకరించాలన్నారు.

# శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయ హుండీ లెక్కింపు

## - గత ఏడాదికంటే ఈ ఏడాది పెరిగిన ఆధాయం

పామిడి, మార్చి 28 ప్రభాతవార్త

శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయానికి సంబందించిన హుండీని శుక్రవారం ఉరవకొండ దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ రాణి, దేవాలయ కార్యనిర్వా హాణాదికారి క్రిష్ణయ్య ఆద్వర్యంలో లెక్కించారు. 21 మూర్చి 2024 నుండి 28 మార్చి 2025 మధ్యకాలంలో భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించగా రూ.162479లు వచ్చిందని వారు తెలిపారు. ప్రతిఏటా మహాశివ రాత్రి తరువాత దేవాలయ హుండీని లెక్కించటం ఆనవాయితీగా వస్తుంద న్నారు. భక్తుల కోరిన కోరికలను తీర్చే కొంగు బంగారంగా పిలువబడుతున్న శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేపడుతూ హుండీలో కానుకలను వేయటం జరుగు తుందన్నారు. గత ఏడాది హుండీని లెక్కించగా రూ.96666లు రాగా ఈ ఏడాది హుండీ లెక్కింపులో రూ.162479లు రావటంతో శ్రీ భోగేశ్వరస్వామి దేవాయలం ఆధాయం పెరిగినట్లైంది. హుండీ ద్వార వచ్చిన ఆధాయాన్ని దేవాలయ కమిటీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ఉరవకొండ దేవాదా యశాఖ ఇన్స్‌పెక్టర్ రాణి, దేవాలయ కార్యనిర్వాహాణాదికారి క్రిష్ణయ్య వెల్లడించారు. ఈకార్యక్రమంలో మురళీధర్‌గుప్తా, సురేష్‌కుమార్, అర్చకులు రాముస్వామి, చంద్రస్వామి, భక్తులు కే.నారాయణమూర్తి, వెంకటరాముడు, యంగమ్మ, పవన్‌కుమార్, పార్వతమ్మ, మల్లికార్జున, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హుండీని లెక్కిస్తున్న దృశ్యం

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పంచ ప్రాధాన్యతలు

పశువుల నీటి తొట్టెలు



చెరువుల పునరుద్ధరణ

ఫారం పాండ్ నిర్మాణం

ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ

అనంతపురం న్యూటౌన్, మార్చి 28 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీలోని పంచ ప్రాధాన్యతలు వివరిస్తు కలెక్టర్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో భాగంగా..

**పశువుల నీటి తొట్టెలు :** వేసవిలో త్రాగు నీటి ఎద్దడి కారణంచే పశువులకు త్రాగునీటి కొరకు పశువుల నీటి తొట్టెలు 646 నిర్మాణాలకు ప్రతిపాదనలు అన్ని మండలాల నుండి స్వీకరించడమైంది. ఏప్రిల్ 1న పరిపాలన ఆమోదం పొంది, ఏప్రిల్ 10, 2025 లోపు అన్ని నిర్మాణాలు పూర్తి చేసి పైపు లైన్ ద్వారా నీటిని నింపి పశువులకు దాహార్తిని తీర్చాలని సిబ్బందిని ఆదేశించడమైంది.

**చెరువుల పునరుద్ధరణ :** గ్రామ, రోడ్డు సమీపాన గల ప్రతి మండలంలో 01 లేదా 02 చెరువులను గుర్తించి వాటిని అభివృద్ధి చేయుటకు, 01-05 ఎకరాల విస్తీర్ణం గల చెరువులకు గుర్తించి ప్రతిపాదనలు పంపాలని అన్ని మండలాల సిబ్బందిని ఆదేశించారు. మొదటి త్రైమాసికంలో ప్రతి మండలంలో 01 చొప్పున జిల్లాలో 31 చెరువులను జూన్ 2025లోపు పూర్తి చేయుటకు లక్ష్యంగా నిర్దేశించడమైంది.

**ఫారం పాండ్ల నిర్మాణం :** ప్రతి రైతు పొలంలో సేద్యపు నీటి కుంటను నిర్మించాలనే సంకల్పంతో మొదటి దశగా జిల్లాకు 9వేల సేద్యపు నీటి కుంటల నిర్మాణాలు ఏప్రిల్ నుంచి జూన్ 2025లోపు పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకోవడమైంది. ఏప్రిల్ నెలలో 4500, మే నెలలో 2700, జూన్ నెలలో 1800 సేద్యపు నీటి కుంటల నిర్మాణము పూర్తి చేయాలని ప్రతి గ్రామ పంచాయితీకి 15 చొప్పున టార్గెట్‌గా ఇవ్వడమైందని ఇప్పటికే 500 సేద్యపు నీటి కుంటల నిర్మాణము పూర్తి చేయడమైంది. మిగిలిన 850 జిల్లాలో మొదటి ప్రాధాన్యతగా వీటిని పూర్తి చేస్తామని తెలియజేయడమైంది. పెద్ద సంఖ్యలో సేద్యపు నీటి కుంటలు చేపట్టిన యెడల జిల్లాలో భూ గర్భ జలాలు పెంపొందించుటకు సేద్యపు నీటి కుంటలు చాలా వరకు దోహదం చేస్తాయి.

**సగటు వేతనం :** ఉపాధిహామీ వేతన దారులకు దినసరి వేతనం రూ.300 పొందేలా సరిపడు గ్రాపు మార్కింగ్ ఇచ్చి, కనీసం 05 గంటలు పని ప్రదేశములో పని చేసేలా కూలీలకు, మేట్లకు అవగాహన కల్పించాలి. జిల్లాలో ఎఫ్‌వై 2024-25 సంవ త్సరం జాబ్ కార్డుల సంఖ్య 2.63 లక్షలు, కూలీల సంఖ్య 4.65 లక్షలు, మొత్తం పనిదినాల సంఖ్య 108.31 లక్షలు, సగటు వేతనం రూ.263.13 చొప్పున 284.83 కోట్ల రూపాయలు వేతనాల రూపంలో ఉపాధిహామీ కూలీలకు చెల్లించడమైంది. ఎఫ్‌వై 2025-26 మొదటి త్రైమాసికంలో భాగంగా ఏప్రిల్ నెలకు 24.62 లక్షలు, మే నెలకు 32.59 లక్షలు, జూన్ నెలకు 10.79 లక్షల మొత్తం 68 లోలు పనిదినాలు చేపట్టేల లక్ష్యముగా నిర్దేశించడమైంది.

**5.ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ :** జిల్లాలో గల సాగునీటి కాలువలలో పూడికతీత కార్యక్రమం చేపట్టి రాబోయే సమయానికి ఆయకట్టుచివరి పొలం వరకు సాగునీరు అందేలా ప్రతి కాలువను పూడికతీత కార్యక్రమం చేపట్టుటకు మొదటి దశగా 93 కిలోమీటర్లు లక్ష్యంగా పెట్టుకోవడమైనది.

# గుమ్మేపల్లి పంచాయితీలో వీధిలైట్లు ఏర్పాటు

## - గ్రామ పంచాయితీ సర్పంచు డేగల లలితమ్మ

శింగనమల, మార్చి 28 ప్రభాతవార్త

మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామ పంచాయితీలోని ఏకుల నాగేపల్లి, గుమ్మేపల్లి గ్రామాల్లో ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశ్యంతో వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచు డేగల లలితమ్మ, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామ సర్పంచుకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ వెల్ఫేర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు బిగిస్తున్న దృశ్యం

# స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోక పోతే ఉద్యమిస్తాం - సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

బుక్కరాయసముద్రం, మార్చి 28 ప్రభాతవార్త

స్మార్ట్‌మీటర్లు ఏర్పాటును ఉపసంహరించాలని కోరుతూ బుక్కరాయ సముద్రం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నానిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, శివారెడ్డి, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, కమిటీ సభ్యలు పుల్లయ్య, నాగరాజు, చంటి, అంకాలు, చిన్నప్ప తదితిరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అదికారం లోకివచ్చిన ఈ కొద్ది కాలంలోనే రెండుసార్లు విద్యుత్ సర్దుబాటుచార్జీల పేరుతో రూ,15485 కోట్ల భారం ప్రజల పై వేసిందని, ఈ భారానికి గత ప్రభుత్వం కారణమని సాకులు చెబుతూ వస్తున్నా రు. చంద్ర బాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సర్దుబాటు చార్జీలను తీవ్రంగా విమర్శించినా టిడిపి, జనసేన నేతలు అదికారంలోకి వచ్చినతరువాత అదే విధానాన్ని కొనసాగిస్తుంది. ప్రతి యూని ట్‌కు నెలకు 1.46నుండి 1.65 అదనంగా చెల్లించాల్సి వస్తుంది. 2024=25 సంవత్సరానికి సంబందించి మరోసారి సర్దుబాటు చార్జీల భారం వేయడానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తు న్నాయి. గత వైసిపి ప్రభుత్వం 5 సంవత్సరాల్లో వేల కోట్ల భారం వేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ వినాశకర విద్యుత్ విధానాన్ని అమలు చేసింద న్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయిం చింది. ఆదాని కంపెనీ ప్రయోజనాలకోసమే సెకి సంస్థతో చేసుకున్న ఒప్పం దాలు రాష్ట్ర ప్రజలపై నిరంతర విద్యుత్ బారాలు వేసే విధంగా ఉన్నాయ న్నారు. పెరిగిన విద్యుత్ భారాలను ప్రజలేకాదు పరిశ్రమలు కూడ భరించే పరిస్థితి లేదన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

# చిన్న జలాలపురం గ్రామంలో గడ్డి వామి దగ్ధం

శింగనమల, మార్చి 28 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన మంగళ వెంకటేశ్వర్లుకు చెందిన గడ్డి వామి దగ్ధమైంది. ఫైరింజన్‌కు ఫోన్ చేయడంతో సమాచారం ఇచ్చినప్పటికీ ఎంతకీ రాకపోవడంతో, అప్పటికే గడ్డి వామి దగ్ధమవుతుం డటంతో రైతులే నీటిని తెచ్చి ఆర్పాలని తీవ్ర ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపుకాకపోవడం వల్ల మొత్తం గడ్డి వామి దగ్ధమైపో యిందని రైతు మంగళ వెంకటేశ్వర్లు తెలిపారు. గడ్డి వామి దగ్ధం కావడం వల్ల దాదాపు రూ.2లక్షలు రూపాయలు నష్టం జరిగినట్లు ఆయన బోరున విలపించారు. కావున ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని రైతు కోరారు.

అగ్నికి అహుతి అవుతున్న గడ్డివామిని ఆర్పుతున్న గ్రామస్తులు

# ప్రకృతి వ్యవసాయం పై శిక్షణాతరగతులు

బుక్కరాయసముద్రం, మార్చి 28 ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయం పై బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో శుక్రవారం వెలుగు కార్యలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సంఘం లీడర్లు, ఆనిమేటర్లు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణాత రగతులకు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, సెరికల్చర్, వెలుగు శాఖల అదికారులతో యాక్షన్ ప్లాన్ పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లడుతూ ప్రకృతివ్యవసా యంలో మెలుకవలు పాటిస్తే అదికదిగుబడులు సాదించుకోవచ్చు, రసాయినిక ఎరువులు వాడకం పూర్తిగా తగ్గించడం జరుగుతుందన్నారు. అనంతరం ఖరీఫ్ వార్షిక ప్రణాళిక పై అవగాహన కల్పించడం జరిగింది. ఎటియం మోడల్ పిఎండిఎస్ ఎ గ్రేడ్ మోడల్ కిచెన్ గార్డెన్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల అధ్యక్షురాలు నాగలక్ష్మి, డిస్టిక్ ఫైనాన్స్ మేనేజర్ సత్యనారాయణ, ఎఫ్‌పిఒ ఎపిఎం రియాజ్, ఎపిఎం నారాయణస్వా మి, ఎఫ్‌పిఒ పుల్లారెడ్డి, సిసిలు ఈశ్వరయ్య, రాజేశ్వరి తదితిరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లడుతున్న వ్యవసాయాధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి

# రైతు ఉత్పత్తి దారులసంఘాల రైతులకు శిక్షణా కార్యక్రమము

కూడేరు, మార్చి 28 ప్రభాతవార్త

స్థానిక మండల కేంద్రం కూడేరు రైతు భరోసా కేంద్రములో శుక్రవారం భారత తోటల యాజమాన్య సంస్థ, ఐఐపీఎం, బెంగళూర్‌కు చెందిన సహచర అధ్యాపకులు డాక్టర్ నరేంద్రన్, రసూల్ పాల్గొని రైతులకు తాము పండించిన పంటలకు మార్కెటింగ్ మెలుకువలు గురించి వివరించారు. రైతులు తాము పండించిన పంటలకు నేరుగా మార్కెట్లలో మధ్యవర్తుల ద్వారా అమ్మకుండా, రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా తమ వ్యవసాయ ఉత్పత్తులను సంఘ సభ్యుల సమిష్టిగా గ్రేడింగ్, బ్రాండింగ్, వాల్యూ ఎడిషన్ మొదలైన ఆధునిక మార్కెటింగ్ విధానాలు అవలభించి అమ్మకాలు జరిపితే తమ వ్యవసాయ ఉత్పత్తులను మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా వినియోగ దారులకు అమ్మకాలు చేస్తే గణనీయమైన లాభాలు పొందవచ్చని ఇందుకు ఉదాహరణగా విశాఖ పట్నం జిల్లాలోని, ఏజన్సీ ప్రాంతాలైన అరకు, చింతపల్లిలోని గిరిజన రైతు ఉత్పత్తి సంఘాలు గిరిజన రైతులు తాము పండించిన కాఫీ పంటనుపై మెలుకువలు పాటించి యూరప్, అమెరికా లాం

## అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలి ..ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, మార్చి 28 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా జి.లక్ష్మీనారాయణ అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో సమగ్ర భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మంత్రి వర్యులు మనోహర్‌లాల్ ఖట్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ 2.0 పరిధిలో 100 పారిశుధ్య నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, అనంతపురంలో మురుగు నీటి సమస్యలు ఇంకా తీవ్రంగా ఉన్నాయని ఎంపీ పేర్కొన్నారు. నగరంలో సరైన భూగర్భ మురుగు నీటి వ్యవస్థ లేకపోవడం వల్ల, ఇళ్ల నుండి వెలువడే మురుగు నీరు నేరుగా ఓపెన్ డ్రైన్స్‌లోకి పోవడంతో, మరువవంక (30 శాతం), నడిమివంక (70 శాతం) తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయి. ఈ కాలుష్యం తడకలేరు నది, శింగనమల చెరువును ప్రభావితం చేసి, తాగునీటి వనరులను, వ్యవసాయాన్ని దెబ్బతీస్తోందన్నారు. అదనంగా, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు డ్రైనేజీ మార్గాలను సంకుచితం చేయడం వల్ల నగరంలో నీటి నిల్వలు పెరిగి, వర్షాకాలంలో భీకర పరిస్థితులు నెలకొంటున్నాయి. భూగర్భ మురుగునీటి వ్యవస్థ లేకపోవడం వల్ల నీటి సంబంధిత వ్యాధులు, దోమల సమస్య, భూగర్భ జల కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం, అనంతపురం నగరానికి భూగర్భ మురుగు వ్యవస్థతో పాటు సీవేజ్ ట్రీట్మెంట్‌ప్లాంట్‌ను మంజూరు చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ ప్రతిపాదనకు మద్దతుగా ఎఎంఆర్‌యుటి 2.0 లక్ష్యాలకు అనుగుణంగా, ఈ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన ఆమోదించి అమలు చేయాలని, తద్వారా నగరంలోని పారిశుధ్య, పర్యావరణ పరిస్థితులు మెరుగుపడి, ఆరోగ్యకరమైన జీవన ప్రమాణాలు ఏర్పడాలని ఎంపీ అభిప్రాయపడ్డారు.

కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

## ప్రజలకు, రైతులకు మీరు జవాబుదారీగా పని చేయండి
### నూతన సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్లకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

అనంతపురం, మార్చి 28 ప్రభాతవార్త బ్యూరో

గ్రామాల్లో ఉన్న ప్రజలకు, రైతులకు మీరు జవాబుదారీగా పని చేయాలని సబ్ స్టేషన్ నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలో నూతనంగా నిర్మించిన సబ్ స్టేషన్లలో ఆపరేటర్లకు ఆమె నియామక పత్రాలు అందజేశారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాలు అందుకున్న ఆపరేటర్లు ఎమ్మెల్యే సునీతకు ధన్యావాదాలు తెలిపారు. రామగిరి మండలం కుంటమద్ది, చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం, అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి, కొడిమి గ్రామాల్లో ఏర్పాటైన విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని వీరు ఒకటవ తేది నుంచి విధుల్లోకి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ..గ్రామాల్లో విద్యుత్ సమస్యలతో ప్రజలు ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారన్నారు. ముఖ్యంగా రైతులకు స్టాలు వర్ణనాతీతంగా ఉంటాయన్నారు. ఇలాంటి సమయంలో విద్యుత్ శాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా అది పరిష్కార మయ్యే వరకు శ్రమించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడైనా సిబ్బంది పై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

## ప్రతి మైనార్టీ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండి ఆదుకుంటాం
### ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం రూరల్, మార్చి 28 ప్రభాతవార్త:

ప్రతి మైనార్టీ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండి ఆదుకుంటామని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణం లోని ముస్లిం మైనార్టీ సోదరులకు షాదిమహాల్ ఫక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే కాలవ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని భోజనాన్ని వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శిష్యులతో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం ప్రభుత్వం ముస్లిం మైనార్టీ కుటుంబాలను చేదోడు వాదోడుగా ఉంటూ నా మైనార్టీలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశామని సూచించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశీస్సుల ఆదరణతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం మైనార్టీ సోదరులను ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆదుకోవడం జరిగిందన్నారు. లౌకికత్వానికి భిన్నంగా ముస్లిం మైనార్టీలకు కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉంటానని భరోసా ఇచ్చారు. నియో కవర్గ వ్యాప్తంగా మైనార్టీలకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కారానికి తగిన కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రంజాన్ మాసంలో ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షత కటోరమైన నియమ నిబంధనలను భగవంతుని ధ్యాస చేయడం ఒక పవిత్రమైన యజ్ఞం లాంటిదని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్ష గొప్పదైనదని ఆరోగ్యానికి శ్రేయస్కారమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు భోజనాన్ని వడ్డిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

కాలవ శ్రీనివాసులను సన్మానిస్తున్న ముస్లిం సోదరులు.

## పురం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా అశ్వర్థరెడ్డి
### 6 సార్లు టిడిపి సర్పంచులను గెలిపించిన నేత

హిందూపురం మార్చి 28 ప్రభాతవార్త

హిందూపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మనేసముద్రం పంచాయతీని తెలుగుదేశం పార్టీ కంచుకోటగా తీర్చిదిద్ది వరుసగా ఆరు సార్లు సర్పంచులను గెలిపించిన ఓటమెరుగని నేత యు. ఆశ్వర్థరెడ్డిని హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నందమూరి తారక రామారావు స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలోనే రాజకీయ ప్రవేశం చేసిన అశ్వర్థరెడ్డి నాటి నుంచి నేటి వరకు క్రమశిక్షణ కలిగిన పార్టీ విధేయుడుగా గుర్తింపు పొందారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ హిందూపురంలో ఎమ్మెల్యే స్థానం టిడిపి ఎలా గెలుచుకుంటుందో.. అదే మాదిరిగా మనే సముద్రం సర్పంచ్ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ గెలుచుకునేల కింగ్ మేకర్ గా వ్యవహరిస్తూ సక్సెస్ అయ్యారు. 2014 సంవత్సరం నుంచి అశ్వర్థరెడ్డి సతీమణి ఉషారాణి మనే సముద్రం పంచాయతీ సర్పంచ్ గా ప్రస్తుతం కొనసాగుతున్నారు. రాష్ట్రంలో టిడిపి సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అహుడా చైర్మన్ పదవి కోసం ఆయన ప్రయత్నించగా జనసేనకు ఆ పదవి కేటాయించడంతో నిరాశ చెంది నప్పటికీ ఎమ్మెల్యే బాలకృష్ణ ఆశీస్సులతో మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బాల య్యతో పాటు వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, బాలాజీ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ పదవి వరించడంతో పార్టీ శ్రేణులు తదితరులు పెద్ద సంఖ్య లో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

యు.అశ్వర్థరెడ్డి

## పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు పార్టీ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం
### శ్రీనగర్ కాలనీలో నేడు అర్బన్ పార్టీ కార్యాలయానికి భూమి పూజ
### నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మార్చి 28 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున అనంతపురం నగరంలో అర్బన్ టీడీపీ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ జరగనుంది. ఇందుకోసం నగరంలోని శ్రీనగర్ కాలనీలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. నేడు తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రతి వాడలోనూ పసుపు జెండా ఆవిష్కరణ జరగాలని సూచించారు. అదే సమయంలో అర్బన్ పార్టీ నూతన కార్యాలయం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న అర్బన్ కార్యాలయానికి సమీపంలోనే పార్టీ కార్యాలయం నిర్మించాలని భావించారు. నేడు జరిగే భూమి పూజ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజునే కార్యాలయ నిర్మాణం కూడా ప్రారంభమవుతుండటం సంతోషంగా ఉందన్నారు. ఇది ఎప్పటికీ గుర్తుండేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ ముఖ్యనాయకుల్ని ఆదేశించారు..

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

## అనంతపురంలో మెగా ఫుడ్ పార్క్ ఏర్పాటు చేయాలి
### - ఆహార ప్రాసెసింగ్ రంగం అభివృద్ధిపై కేంద్రంతో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చర్చ

అనంతపురం, మార్చి 28 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం ఎంపీ అంబికా జి.లక్ష్మీనారాయణ, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి రంజిత్ సింగ్‌ని కలుసుకుని, ఆంధ్రప్రదేశ్‌లో ఆహార ప్రాసెసింగ్ పథకాల అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధానంగా ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రామాణీకరణ పథకం అమలు, ఇందులో భాగంగా తిరుపతి, విశాఖపట్నం జిల్లాల్లో మంజూరైన రెండు ఇన్‌క్యుబేషన్ సెంటర్ల ప్రగతి గురించి చర్చించినట్లు తెలిపారు. తిరుపతి ఇన్‌క్యుబేషన్ సెంటర్ త్వరలో ప్రారంభం కానుందని, ఇది ఆ ప్రాంతంలోని సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుంది.

అలాగే, పిఎంఎఫ్ఎంఇ, ప్రధాన్ మంత్రి కిసాన్ సంపద యోజన పథకాల అమలును మరింత మెరుగుపరచే వ్యూహాలు, నిధుల సద్వినియోగం, అనంతపురం జిల్లా లో ప్రధానంగా ఉద్యాన పంటల అభివృద్ధి కోసం జిల్లాలో మెగా ఫుడ్ పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలని , మరింత మందికి వీటి ప్రయోజనాలు అందేలా చేయడం వంటి అంశాలపై చర్చించారు. ఈ భేటీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఆహార ప్రాసెసింగ్ రంగాన్ని బలోపేతం చేసి, యువ పారిశ్రామికవేత్తలు, రైతులు, చిన్న తరహా వ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రతిబద్ధత వ్యక్తమైంది.

ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి రంజిత్ సింగ్‌తో మాట్లాడుతున్న ఎంపి

## ప్రకాష్ రెడ్డి నీ పద్ధతి, నీ మాట తీరు రెండూ మార్చుకో
### రామగిరి ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, మార్చి 28, (ప్రభాతవార్త బ్యూరో)

రాప్తాడు నియోజకవర్గం రామగిరి ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వ్యవహరించిన తీరు పై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ పద్ధతి.. నీ మాట తీరు రెండూ మార్చుకోవాలని లేకపోతే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆమె హెచ్చరించారు. శుక్రవారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎంపీపీ ఎన్నిక సమయంలో ఏ పార్టీ సభ్యులైనా వారి ఇష్టపూర్వకంగా వ్యవహరించే హక్కు ఉంటుందన్నారు. వారి సభ్యులు 8మంది ఉన్నా.. ప్రకాష్ రెడ్డి ఎందుకు హంగామా చేశారో సమాధానం చెప్పాలన్నారు. విప్ జారీ పేరుతో కొందరు బీసీ నాయకులను అక్కడికి పంపి.. ఉద్దేశ్యపూర్వకంగా కవ్వింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. తన వాహనంలో మారుణాయుధాలతో మనుషుల్ని పంపించారన్నారు. ఆ రోజు టీడీపీ నాయకులు చాలా సంయమనంతో.. పోలీసులు అప్రమత్తతో వ్యవహరించారన్నారు. టీడీపీ నాయకుల వాహనాల్ని ధ్వంసం చేసి.. పైగా తామే బీసీ నాయకులపై దాడి చేసినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్ పై ప్రతిసారి విమర్శలు చేస్తూ... పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ నాయకులపై దాడులు అనే బదులు.. రామగిరికి మీ సోదరులిద్దరినీ పంపి ఉండొచ్చు కదా అని ప్రశ్నించారు. అధికారం అనుభవించేందుకు, దోచుకునేందుకు మీ అన్నలు ఉండాలి.. గొడవలకు బీసీ నాయకుల్ని బలి చేస్తారా అంటూ నిలదీశారు. మాకు బలం ఉందని చెప్పుకునే ప్రకాష్ రెడ్డి ఎందుకు క్యాంపుల పేరుతో డ్రామాలు ఆడావో చెప్పాలన్నారు. పైగా ఈ రెవెన్యూ డివిజన్ కు సంబంధం లేని పెనుకొండకు వెళ్లి అక్కడ మీ జిల్లా అధ్యక్షురాలితో కలిసి నాటకాలు ఆడటం ఏంటని ప్రశ్నించారు. పైగా పోలీసుల మీదకు ఒక రౌడీలా వెళ్తూ బూతులు తిడతావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఎంపీటీసీ సభ్యులపై మీకు నమ్మకం లేక వారిని రామేశ్వరం వరకు తీసుకెళ్లి ఇబ్బందులు పెట్టారన్నారు. పేరూరు 2 ఎంపీటీసీ కూతురుకి ఆరోగ్యం బాగా లేకపోతే.. చూసేందుకు వెళ్లకుండా కట్టడి చేశారన్నారు. చివరకు ఆమె వారి చెరనుంచి తప్పించుకుని వస్తే మేము కిడ్నాప్ చేసినట్టు పుకార్లు పుట్టించారన్నారు. ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేగా పని చేసిన నీకు ఇలా వ్యవహరించేందుకు సిగ్గుగా లేదా అంటూ సునీత మండిపడ్డారు. నువ్వు ఇంకా అధికారంలో ఉన్నావన్న భ్రమలతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, అయినప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను చూసి ఊరుకున్నామని ఆమె వివరించారు..

## పివికెకె ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయి సాంకేతిక సదస్సు
### - సంగ్యాస్-2కె25 ఘనంగా నిర్వహణ

అనంతపురం, మార్చి 28 ప్రభాతవార్త బ్యూరో

స్థానిక పివికెకె ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయస్థాయి సాంకేతిక సదస్సు సంగ్యాస్-2కె25 మార్చి 27, 28 తేదీలలో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు జెఎన్‌టియుఏ అనంతపురం వర్సిటీ ప్రొఫెసర్ డా. ఎపి.శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఆయన మాట్లాడుతూ..ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు పరిశోధనా దృష్టి కలిగి ఉండాలి. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఆవిష్కరణలకు ప్రేరణగా నిలుస్తాయి" అని సూచించారు. ఈ సింపోజియంలో రాయలసీమ ప్రాంతం మరియు ఇతర ఇంజనీరింగ్ కళాశాలల నుండి 200+ మంది విద్యార్థులు పాల్గొని తమ టెక్నికల్ నైపుణ్యాలను ప్రదర్శించారు.

ముఖ్యంగా, పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్పో, టెక్నికల్ డిబేట్ వంటి విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి బహుమతులు గెలుచుకున్నారు. ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, బ్లాక్‌చైన్ టెక్నాలజీపై నిపుణుల చేత ప్రత్యేక సెమినార్లు నిర్వహించగా, విద్యార్థులు వాటిని ఆసక్తిగా అనుసరించారు. కళాశాల చైర్మన్ డా పల్లె వెంకట కృష్ణ కిషోర్, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు అధ్యక్షతన, సిఎస్ ఈ విభాగాధిపతి డా.దిలీప్ వెంకట కుమార్, సిఎస్‌డి విభాగాధిపతి అవని జా, ధరణి కుమార్ సమన్వయ బాధ్యతలు నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కోఆర్డినేటర్లు టీ.బాబా, శ్రావణి సహా అధ్యాపక బృందం అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ఏవో డాక్టర్ మనోహర్ రెడ్డి,అధ్యాపకులు పాల్గొని, ఇలాంటి విద్యా కార్యక్రమాలు భవిష్యత్‌లో మరింత విస్తృతంగా నిర్వహించి, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను కల్పించేందుకు పివికెకె ఇంజనీరింగ్ కళాశాల కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలిపారు.

ప్రొఫెసర్‌శివకుమార్‌ను సన్మానిస్తున్న పివికెకె ఇంజి నీరింగ్ కళాశాల యాజమాన్యప్రతినిధి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీబాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్

## బ్లాక్ స్పాట్లలో రెండు వారాల్లోగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి
### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, మార్చి 28 ప్రభాతవార్త

జిల్లాలో 37 బ్లాక్ స్పాట్లను గుర్తించగా, ఆయా బ్లాక్ స్పాట్లలో రెండు వారాల్లోగా సిసి కెమెరాలు ఏర్పాటు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంత పురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రోడ్డు భద్రతా సమావేశాన్ని, ఎన్‌సిఆర్‌డి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్‌పి పి.జగదీష్‌తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బ్లాక్‌స్పాట్లలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతినెల రోడ్డు భద్రతలో భాగంగా జరిమానాల వసూలు, విత్‌ఔట్ హెల్మెట్, ఓవర్ స్పీడ్ వెళ్తున్న వారిని ఎంతమందిని పట్టుకున్నారు, తదితర అంశాలపై ప్రొఫార్మాలో ప్రతినెలా వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. నగరంలో 164 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో నగరంలోని సిగ్నల్స్ ప్రాంతాల్లో గ్రీన్‌షెడ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్లపై మార్కింగ్, రీ పెయింటింగ్ చేయాలన్నారు. 1972 టోల్ ఫ్రీ నెంబర్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్‌పి పి.జగదీష్ మాట్లాడుతూ నగరంలో కొత్తగా 6 ట్రాఫిక్ సిగ్నల్స్‌లను గుర్తించామని, అక్కడ సిసి కెమెరాల ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు భాగస్వామమై మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. నగరంలోని జిజిహెచ్‌లో మానసిక వైద్య నిపుణులను నియమించాలన్నారు. ఈ సందర్భంగా ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్‌ను ఉపయోగిస్తున్న ధన్వి మోటార్స్‌లో పనిచేసే అరుణ్‌కు మార్‌కు సర్టిఫికెట్, మెమొంటోలను జిల్లా కలెక్టర్, ఎస్‌పి అందజేశారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ ఏ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఎస్‌బిఆర్‌ఎస్ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ రాజగోపాల్, డిటిసి వీర్రాజు, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ బాలరాజు, ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఎస్ఇ జహీర్‌అస్లాం, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డిఎస్‌పిలు శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, డిప్యూటి హెచ్ఇఓ గంగాధర్, ఏపిఎస్ఆర్టీసి ఆర్‌ఎం సుమంత్ ఆర్.ఆదోని, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూకొఠారి, ఎన్‌హెచ్‌ఏఐ పిడి తరుణ్‌కుమార్, ఐరాడ్ జిల్లా మేనేజర్ నాయక్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

పాల్గొన్న అధికారులు

## ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
### - వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, మార్చి 28 ప్రభాతవార్త

ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద ఏప్రిల్ 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఎన్టీఆర్ భరోసా పథకం కింద 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి సంబంధించిన సన్నద్ధతపై డిఆర్‌డిఏ, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, బ్యాంకు నోడల్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద మొత్తం పెన్షన్లు 2,79,165 వుండగా, పెన్షన్ల మొత్తం 123.76 కోట్ల రూపాయలు పంపిణీ చేయాల్సి వుందని, ఇందుకు సంబంధించి అన్ని విధాల సన్నద్ధం కావాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 7 గంటలకి పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలని, ముందుగా వెళ్ళరాదన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎలాంటి అవినీతికి తావివ్వరాదన్నారు. శనివారంలోగా బ్యాంకుల నుండి డబ్బులు డ్రా చేసుకొని పెట్టుకోవాలని, ఈ విషయమై ఆయా మండలాల ఎంపిడిఓలు బ్యాంక్ మేనేజర్లతో మాట్లాడాలన్నారు. పి4 సర్వే కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి విజయవాడలో ప్రారంభించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా నుండి బస్సు ఏర్పాటు చేసి స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, రైతులు, లేబర్స్‌ను గుర్తించి అక్కడికి పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమం కోసం లైజన్ అధికారులను నియమించాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఏ పిడి ఈశ్వరయ్య, ఎల్‌డిఎం నర్సింగరావు, సిపిఓ అశోక్‌కుమార్, ఏపిఎస్ఆర్టీసి ఆర్‌ఎం సుమంత్ ఆర్.ఆదోని, లేబర్ డిసి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

## జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి వాతావరణ